క్లుప్తంగా

మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలో వెలసిన మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవిందు ఆధ్వర్యంలో అమ్మ వారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా సుంకులమ్మ దేవర



పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామం జగనన్న కాలనీలో మంగళవారం సుంకులమ్మ దేవరను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ముందుగా బోనాలతో గ్రామ వీధుల మీదుగా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుమారుడు రామ్మోహన్‌రెడ్డి, పత్తికొండ మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, ఎం.అగ్రహారం సర్పంచ్ విజయుడు, నాయకులు కృష్ణ, భద్రయ్య, కృష్ణారెడ్డి, మాధవ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే సత్ఫలితాలు



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న డీఈఓ శామ్యూల్

చిప్పగిరి: ఏకాగ్రత తో చదివితే సత్ఫలితాలు వస్తాయని డీఈఓ శామ్యూల్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ తన మాతృమూర్తి స్వగ్రామం చిప్పగిరి అని, అందుకే తనకు సొంత ఊరి లాంటిదన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు బహుమతులు అందిస్తానని హామీ ఇచ్చారు. పరీక్షల రాస్తున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్, జామెట్రీ బాక్స్ తదితరాలు తన సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, సావిత్రమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కృష్ణగిరి: ఆచార్య ప్రబోధానంత యోగీశ్వరుల స్వామి రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి తెలుసుకోవాలని ప్రబోధ సేవా సమితి సభ్యులు శివప్రసాద్, రామకృష్ణ, మోహన్‌కృష్ణ కోరారు. మంగళవారం జలదుర్గం, హుసేనాపురం, ఏనుగమర్రి, పోతుగల్లులో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలను అందజేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. సమితి సభ్యులు గంగాధర్, మల్లేశ్వరయ్య, పుల్లయ్య, నారాయణ, ఈశ్వరయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీరంగనాథస్వామి


మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆకుపం దిళ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. విష్వక్సేన పూజల అనంతరం కలశస్థాపన, అంకురార్పణ కార్యక్రమాలు జరిగాయి. సకల దేవతలకు ఆహ్వానం పులుకుతూ ధ్వజారోహణం చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీపై కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ ఈఓ వీరయ్య, సర్పంచ్ మలికార్జున పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దేవనకొండ: మండల కేంద్రం సమీపంలో ఈనెల 8న పురుగు మందు తాగిన పింజారి వాహిద్(24) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందాడు. పెద్దకడబూరు మండలం తారాపురం గ్రామానికి చెందిన చాంద్‌బీతో వాహిద్‌కు కొన్నేళ్ల క్రితం వివాహమయ్యింది. అయితే కుటుంబ కలహాల వల్ల చాంద్‌బీ ఈనెల 3న నందవరం గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో భార్య పుట్టింటి వారు అతనిపై కేసు పెట్టారు. అప్పటి నుంచి భార్య బంధువులు ఏమైనా చేస్తారేమోనని భయపడుతూ దేవనకొండ గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చి తల దాచుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 8న స్వగ్రామానికి వెళ్తూ దేవనకొండ టర్నింగ్ వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేకపోయాడు. మృతుడి తండ్రి ఖాజాహుసేన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపాడు.

ఇది బస్టాండేనా?

- 1993లో ఆలూరు బస్టాండ్ నిర్మాణం
- ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంలో ఆధునీకరణ
- బస్సు వేళల పట్టిక, బస్టాండ్‌పై బోర్డు ఏర్పాటు చేయని వైనం
- లోపలికి రాకుండా వెళ్లి పోతున్న బస్సులు



బోర్డు లేని ఆలూరు ఆర్టీసీ బస్టాండ్



బస్సుల రాకపోకల పట్టికపై పెయింట్ కొట్టిన దృశ్యం

ఆలూరు: నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించినప్పటికీ ప్రయాణికులకు పూర్తి స్థాయిలో సేవలందడంలేదు. ఆధునీకరణ పనుల్లో కొన్ని లోపాల కారణంగా కొన్ని బస్సులు బస్టాండ్‌లోకి రాని పరిస్థితి. అలాగే టైమింగ్ బోర్డు ఏర్పాటు చేయకపోడవంతో ప్రయాణికులు ఏబస్సు ఎప్పుడొస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

1993 బస్టాండ్ ఏర్పాటు

నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం 1993లో కర్నూలు, బళ్లారి రోడ్డు సమీపంలో బస్టాండును ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇక్కడి నుంచి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల రాకపోకల పట్టికను కూడా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా కంట్రోలర్‌ను నియమించారు. ఇక్కడి నుంచి ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కర్నూలు, విజయవాడ, బనగానపల్లి, డోన్, నందికొట్కూరు డిపోలకు చెందిన బస్సులే కాకుండా అనంతపురం జిల్లా రాయదుర్గం, ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి, సింధనూరు, శివమొగ్గ డిపోలకు చెందిన బస్సులు ఈ బస్టాండులోకి వచ్చి వెళ్లేవి. ప్రయాణికులు బెంగళూరు, హైదరాబాద్, విజయవాడతో పాటు అన్ని జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉండేది.

రూ.40 లక్షలతో ఆధునీకరణ

ప్రస్తుతం బస్టాండు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దాదాపుగా రూ.40 లక్షల వరకు ఖర్చు పెట్టి ప్లాట్‌ఫాం, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు తదితర రకాలుగా ఆధునికీకరణ పనులు, మరమ్మతుల పనులను చేశారు. అయితే కొత్తగా పేయింటింగ్ వేశాక బస్టాండులో ప్రయాణికులు సౌకర్యార్థం బస్సుల రాకపోకల పట్టిక వేళలను ఏర్పాటు చేయలేదు. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఒక రిటైర్డ్ కండెక్టర్‌ను నియమించారు. ఇదిలా ఉండగా బస్టాండుపై ఇది ఆర్టీసీ బస్టాండు (ప్రయాణికుల ప్రాంగణం) అని బోర్డు కూడా లేకపోవడంతో కొత్తవారు బస్టాండును కనుక్కోలేకపోతున్నారు. పైగా బస్టాండులో ఇన్, అవుట్ గేట్ల వద్ద బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ రూట్లో కొత్తగా వచ్చిన డ్రైవర్లయితే బస్టాండు కనుక్కోలేక ఆపకుండా వెళ్లిపోతున్నారు. అధికారులు స్పందించి బస్టాండుకు బోర్డుతో పాటు ఇన్, అవుట్ సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- హొళగుంద పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

హొళగుంద: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒక సారి డబ్బు వెళ్లిందంటే తిరిగి రావడం కష్టమని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన హొళగుంద పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు వివిధ నేరాలకు సంబంధించి కేసుల రికార్డులను పరిశీలించారు. మండలంలో నేరాలు, పెండింగ్ కేసులు తదితరతో పాటు సిబ్బంది పనితీరు గురించి ఎస్‌ఐ బాల నరసింహులును అడిగి తెలుసుకున్నారు. ×నేను- సైబర్ స్మార్ట్¤ అనే కార్యక్రమం ద్వారా ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ అసంఘిక కార్యకలాపాలు, ఇతర నేర సమాచారాలను పోలీసుల దృష్టికి తీసుకొచ్చి శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.



మార్లమడికి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సిబ్బందిని విచారిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ

ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మిక తనిఖీ చేసారు. కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్రమ రవాణను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వద్దని, ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. ఆయన వెంట ఆలూరు సీఐ వెంకట చలపతి, హొళగుంద ఎస్‌ఐ బాలనరసింహులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం



ఆలూరులో ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప



పుల్లగుమ్మి హైస్కూల్ విద్యార్థులకు చెత్త నిర్వహణపై అవగాహన

ఆలూరు రూరల్: అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప అన్నారు. మండలంలోని మనేకుర్తి గ్రామంలో మంగళవారం ఈఓఈఆర్డీ ప్రభాకర్, పంచాయతీ కార్మికులతో కలిసి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

చెత్త నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

వెల్దుర్తి: మండల పరిధిలోని పుల్లగుమ్మి హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం గ్రామ సెక్రటరీ రహమత్ బాషా ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన పెంచుకుని తల్లితండ్రులు పాటించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుహాసిని, ఉపాధ్యాయులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ చెన్నమాధవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, నాయకులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో వెలిసిన లక్ష్మీచెన్నమాధవస్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చ, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు చేపట్టారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథ చక్రాలు ముందుకు కదిలాయి. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాంబ, రాజన్న, రామిరెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

హాలహర్వి: మండలంలోని జె.హొసల్లి గ్రామంలో మంగళవారం హాలహర్వి పోలీసులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. జె.హొసల్లి గ్రామానికి చెందిన బాలిక గూళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరతి చదువుతోంది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక తల్లిదండ్రులు బడి మాన్పించి, పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన ఓ యువకుడితో పెళ్లి నిశ్చయం చేశారు. రెండు రోజుల్లో పెళ్లి జరగనుంది. అయితే అధికారులు వారం క్రితమే బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అయినా వారు ఎవరికి తెలియకుండా పెళ్లి చేయాలని ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న హాలహర్వి ఎస్‌ఐ చంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చందన, చంద్రావతి గ్రామానికి వెళ్లి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలికకు 18 ఏళ్లు నిండిన తరువాతనే పెళ్లి చేయాలని సూచించారు.

సర్వే చేయలేకపోతున్నాం



ఎంపీడీఓ విశ్వమోహన్‌కు సర్వే కష్టాలు మొరపెట్టుకుంటున్న మహిళా పోలీసులు

తుగ్గలి: 'యాప్‌లో ఉన్న పేర్లు ఇళ్లకు వెళితే లేవు. వలసలు వెళ్లిన వారు సరిగా స్పందించక ఓటీపీలు చెప్పడం లేదు. ఒకే పేరు అన్ని క్లస్టర్లలో నమోదయ్యాయి. ఇలాంటి వారి సర్వే పూర్తి చేసినా మిగిలిన క్లస్టర్లలో సర్వే పూర్తి కాలేదని చూపుతున్నాయి. ఇలా అయితే తాము ఎలా సర్వే చేయాలంటూ' సచివాయల మహిళా పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చైల్డ్ ఆధార్ సర్వేలో తలెత్తుతున్న సమస్యలను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విశ్వమోహన్‌కు వారు మొరపెట్టుకున్నారు. కొంత మంది పిల్లల పేర్లు ఆ గ్రామంలోనే లేవని, డబుల్ ఎంట్రీలు, కొందరు ఓటీపీలు చెప్పడం లేదని ఇలా అనేక సమస్యలు తలెత్తుతుంటే సర్వే ఎలా చేయాలని మహిళా పోలీసులు వాపోయారు. సర్వేలో వచ్చిన సమస్యలకు సంబంధించి కారణాలను రాసిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఎంపీడీఓ తెలిపారు. సర్వే మాత్రం త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు.





పూజలందుకున్న సుంకులమ్మవ్వ, వెంగళాయిదొడ్డిలో కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా సుంకులమ్మవ్వ దేవర

ఆస్పరి: మండలంలోని కారుమంచి మజరా గ్రామమైన వెంగళాయిదొడ్డిలో మంగళవారం సుంకులమ్మవ్వ గ్రామ దేవర ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సుంకులమ్మవ్వకు గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడిగా మేళతాళాలతో కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సుంకులమ్మవ్వకు నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు.

రేపు సామాజిక తనిఖీ బహిరంగ సభ

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాల్లో 2023 నుంచి మార్చి 2024 వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీఓ నర్సిరెడ్డి మంగళవారం తెలిపారు. మేటీలు, కూలీలు హాజరు కావాలన్నారు.

15న ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం

తుగ్గలి: స్థానిక స్త్రీ శక్తి భవనం ఆవరణలో ఈనెల 15న మండలంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేసిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీలు చేశాయన్నారు. తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలను ఓపెన్ ఫోరంలో వెల్లడిస్తారని వివరించారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపాధి కూలీలు హాజరుకావాలని కోరారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

పత్తికొండ రూరల్: బీసీ వసతిగృహ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇస్తున్న చార్జీలు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. బీసీ బాలురు, బాలికలకు శాశ్వత వసతి గృహాలు నిర్మించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బాలికల హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, హెల్పర్స్, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పత్తికొండలో బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

రైతు సేవా కేంద్రాల్లో పంటల నమోదు జాబితా

తుగ్గలి: రబీ 2024–25కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటల వివరాలను మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు ప్రదర్శించారు. మండల వ్యాప్తంగా 3,150 మంది రైతులు 3,852 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. పంట సాగు చేసిన వివరాలు జాబితాలో ఉన్నాయా లేదా అనేది రైతులు చూసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఏవైనా తప్పులు ఉంటే వారంలోగా రైతు సేవా కేంద్రాల్లో రాత పూర్వకంగా తెలపాలని సూచించారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 22వ తేదీ తుది జాబితా విడుదల చేస్తామన్నారు.

హంద్రీ-నీవాకు నీళ్లు ఇవ్వాలని వినతి

పత్తికొండ రూరల్: హంద్రీనీవాకు ఏప్రిల్ 15వ తేదీ వరకు నీళ్లు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి.సురేంద్రకుమార్ మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ సుదర్శన్‌కు వినతి పత్రం అందజేశారు. మార్చి 15 నాటికి హంద్రీ-నీవాకు నీరు నిలిపేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

దేవనకొండ: మండలంలోని బండగట్టు గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు యూసుఫ్‌బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బండగట్టు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, గత పది రోజుల క్రితం విషయాన్ని అధికారులకు తెలియజేసినా ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

హొళగుంద: ఈ నెల 22న కోడుమూరులో జరగనున్న రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, పెద్దలు కురుకుంద నాగరాజు, మంగయ్య, మల్లికార్జున తదితరులు పిలుపునిచ్చారు. మంగళవారం హొళగుందలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అనేక అంశాలకు సంబంధించి మహా సభలో చర్చించడం జరుగుతుందన్నారు. రజకులందురూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం సభ్యులు మల్లికార్జున, సున్నం వీరేశ్, హనుమేష్, కృష్ణ, వీరేష్, రాము తదితరులు ఉన్నారు.

'యువత పోరు'కు తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి హర్ధగేరి శ్రీనివాసులు



మద్దికెరలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు



కృష్ణగిరిలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి

హాలహర్వి: కర్నూలులో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున యువకులు, నిరుద్యోగులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి హర్ధగేరి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. దీంతో నిరుద్యోగులు, అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే యువతపోరులో నిరుద్యోగులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, నాయకులు బాపురం కృష్ణ, పల్లె రవి, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేలా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం(నేడు) కర్నూలులో తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆ పార్టీ నాయకుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, సేవాదల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణరెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజశేఖర్ తుగ్గలిలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణానాయక్, ఈశ్వరరెడ్డి, సత్యప్ప పాల్గొన్నారు.

మద్దికెర: విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా నిలిచేందుకు బుధవారం కర్నూలులో చేపడుతున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు, పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం మద్దికెరలో యువతపోరు పోస్టర్లు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని ఇంతవరకు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. గతంలో కూడా కేవలం మూడు నెలలు మాత్రమే ఇచ్చి మోసం చేయడం నిరుద్యోగులు మరిచిపోలేదన్నా రు. విద్యార్థులు, తల్లిదండ్రులు నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శాంతన్న, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటరాముడు, రామాంజులు, శివప్ప, చంద్ర, కవి చౌడప్ప పాల్గొన్నారు.

కృష్ణగిరి: సీఎం చంద్రబాబు విద్యార్థులు, నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ నగిరి మాధవరావు విమర్శించారు. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి మంజూరు చేయకుండా నిండా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణగిరిలో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం కర్నూలులో జరగనున్న యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వానికి కనివిప్పు కలిగేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు జయరామిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, హుసేన్‌సాహెబ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్న పత్రాలు

హొళగుంద: ఈ నెల 17 నుంచి మొదలయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాల రెండవ సెట్ మంగళవారం హొళగుంద పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. రూట్ ఆఫీసర్ రహమాన్, కస్టోడియన్ ఆఫీసర్ కబీర్‌సాబ్, సుధాకర్, చీఫ్‌లు పొంపన్నగౌడ్, ఖాజాహుసేన్‌లు సెట్-2 ప్రశ్న పత్రాలను స్టేషన్‌లో భద్ర పరిచారు. పబ్లిక్ పరీక్షలను నిర్వహించెందుకు గాను హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు, కేజీబీవీలో ఒకటి, హొళగుంద జూనియర్ కళాశాలలో ఒకటి మొత్తం నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. మండలానికి సంబంధించి మొత్తం 789 మంది పరీక్షలు వ్రాస్తున్నట్లు ఎంఈఓ-1 సత్యనారాయణ తెలిపారు.

జి.మల్లాపురలంలో సుంకులమ్మ దేవర

కృష్ణగిరి: మండల పరిధిలోని జి.మల్లాపురం గ్రామంలో మంగళవారం సుంకులమ్మ దేవరను గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాములమ్మకు ప్రత్యేక పూజలతో దేవర ఉత్సవాలు ముగియనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు టి.గోకులపాడులో బోనాల సమర్పణ

మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో మంగళవారం గ్రామ దేవతల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్దమ్మ, కర్రెమ్మ, చిన్నమ్మ అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. బుధవారం అమ్మవార్లకు బోనాల సమర్పణ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. దేవరకు వచ్చిన బంధుమిత్రులతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

పనిభారం, ఒత్తిడి తగ్గించాలి

దేవనకొండ: పంచాయతీ కార్యదర్శులపై అధిక పనిభారం, ఒత్తిడిని తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు రాముడు, శివశంకర్‌సింగ్, లక్ష్మన్న, శ్రీనివాసులు, ఉసేన్, అబ్దుల్ రహమాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. వారు మట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు తమకు అప్పగించడంతో సెలవు దినాల్లో, పండగ దినాల్లోనూ పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక పనిభారం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, యుగంధర్, సునీత, తులసి, మోహిని, రఫీ, విరోజా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో ప్రభుత్వం విఫలం

మద్దికెర: సూపర్ సిక్స్ పథకాల అమల్లో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగభృతి, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు నాగరత్నమ్మ, వెంకటేశ్వర్లు, సర్పంచ్ విజయుడు, మండల కన్వీనర్ మల్లికర్జున పాల్గొన్నారు.

నాటుసారాను అరికడదాం



నెరణికి తండాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆలూరు రూరల్: నాటుసారాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలన, కలిగే నష్టాలపై మంగళవారం హొళగుంద మండలంలోని నెరణికి, నెరణికి తండా గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. నాటుసారా తయారీ, వాటి వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నవీన్ బాబు, సిబ్బంది ఉన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

మద్దికెర: సారా తయారు చేసినా, విక్రయించినా నేరమని.. కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తాగడం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా తమకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సాయి ప్రవీణ్ పాల్గొన్నారు.